లోయర్‌ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్‌, ఎమ్మెల్యే గడ్డం వివేక్‌, ఎమ్మెల్సీ కోదండరాం





నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్‌ నేత సిరిగిరి శ్యామ్‌, కాంగ్రెస్‌ మహిళా నేత ఉషా శ్రీకాంత్‌గౌడ్‌




డా. బీఆర్. అంబేడ్కర్‌కు నివాళి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ వర్ధంతిని శుక్రవారం జోన్‌వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్‌ విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్‌ విద్యాసంస్థల డైరెక్టర్‌ డాక్టర్‌ విష్ణుప్రియా మాట్లాడుతూ... అణగారిన వర్గాల హక్కుల కోసం కృషి చేసిన మహనీయుడు డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ అని అన్నారు. పార్లమెంటులో హిందూ కోడ్‌ బిల్లు, బీసీ రిజర్వేషన్‌ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు అగ్రవర్ణాలకు చెందిన నాయకులు అడ్డుకున్నారని అప్పుడు తన మంత్రి పదవికి సైతం రాజీనామా చేసిన గొప్ప ఆదర్శమూర్తి అని కొనియాడారు.

– అంబర్‌పేట, ముషీరాబాద్‌ జోన్‌ బృందం





కుద్బిగూడ, లింగంపల్లి చౌరస్తా, బర్కత్‌పురలలో నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు బబ్లూ సింగ్‌, సదానంద్‌, గోరఖ్‌సింగ్‌, డాక్టర్‌ ఎన్‌.గౌతంరావు



నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్‌ వీఎస్‌ఆర్‌



అరుంధతినగర్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నేత వినయ్‌కుమార్‌



నివాళులర్పిస్తున్న కవాడిగూడ కార్పొరేటర్‌ జి. రచనశ్రీ



అంబేడ్కర్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

నేటి నుంచి హరికథా మహోత్సవాలు

నల్లకుంట: అన్నమయ్య పరివారం, నేతి కుటుంబం, ప్లాంజేరి ఫౌండేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి 12వ తేదీ వరకు హరికథా మహోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని సంస్థ కన్వీనర్‌ యనమండ్ర కృష్ణయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో ప్రతిరోజు సాయంత్రం 5.45గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. 7న వై.శిఖామణి భాగవతారిణిచే 'భక్త ప్రహ్లాద'హరికథా గానం ఉంటుందన్నారు. 8న మునిలక్ష్మి భాగవతారిణిచే 'భక్త మార్కండేయ'హరికథా గానం, 9న ఎస్‌.చిరంజీవా చార్యులు భాగవతార్‌చే 'ద్రౌపదీ స్వయంవరం'పై ఉంటుందని తెలిపారు. 10న సప్పా భారతి భాగవతారిణిచే 'భక్త అంబరీష'హరికథా గానం ఉంటుందని చెప్పారు. 12న బుర్రా పద్మనాభ శర్మ భాగవతార్‌చే 'శ్రీరామ పట్టాభిషేకం'హరికథా గానం ఉంటుందన్నారు.

◆ అనంతరం హరికథా మధ్యమున సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. దీనికి ముఖ్యఅతిథిగా శ్రీప్లాంజేరి ఫౌండేషన్‌ వ్యవస్థాపకుడు ప్లాంజేరి శంకరనారాయణ హాజరై దాలిపర్తి ఉమా మహేశ్వరి భాగవతారిణిని 'హరికథా సరస్వతి'బిరుద ప్రదానంతో గౌరవించి సన్మానించి, ప్రసంగిస్తారని చెప్పారు. ఔత్సాహికులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కృష్ణయ్య కోరారు.

ప్రొ. కేశవరావు జాదవ్‌ జీవితాన్ని పాఠ్యాంశంగా పెట్టాలి

కాచిగూడ: తెలంగాణ ఉద్యమకారుడు ప్రొ. కేశవరావు జాదవ్‌ జీవితాన్ని విద్యార్థులకు పాఠ్యాంశంగా పెట్టాలని తెలంగాణ మోటార్‌ ట్రాన్స్‌ఫోర్ట్‌ డ్రైవర్స్‌ యూనియన్‌ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు దూసరి రాజుగౌడ్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. కేశవరావు జాదవ్‌ ఎక్కువ కాలం ఇంగ్లిష్‌ ప్రొఫెసర్‌గా పనిచేసిన ఓయూ ఇంజినీరింగ్‌ కళాశాలకు జాదవ్‌ పేరు పెట్టాలన్నారు. కేశవరావు జాదవ్‌ జన్మించిన హుస్సేనీ ఆలంతో పాటు జిల్లా కేంద్రాల్లో ఆయన విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు. హుస్సేన్‌సాగర్‌ ట్యాంక్‌బండ్‌పైన కేశవరావు జాదవ్‌ స్మృతి వనం ఏర్పాటు చేయాలన్నారు.

ముషీరాబాద్‌ యువజన కాంగ్రెస్‌ ఉపాధ్యక్షుడిగా ఈసరి అజయ్‌

కవాడిగూడ: ముషీరాబాద్‌ నియోజకవర్గం యువజన కాంగ్రెస్‌ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా కవాడిగూడకు చెందిన ఈసరి అజయ్‌ రెండోసారి విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముషీరాబాద్‌ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ పార్టీ బలోపేతానికి తన శక్తి మేరకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్తామన్నారు. ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్‌ ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాలను మానుకోవాలని ఆయన హితవు పలికారు. తమ గెలుపున సహకరించిన కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు అభిషేక్‌రెడ్డి, యువజన నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కాలుష్య రహిత సమాజ స్థాపనకు కృషి



ముషీరాబాద్‌: అంబర్‌పేటకు చెందిన కాలపరిమితి తీరిన వాహనాల స్క్రాప్‌ చేసేందుకు అనుమతి పొందిన రిషబ్‌ సోమానిని అభినందిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ ఆయనకు మెమొంటో అందజేసి సన్మానించారు. కాలుష్య రహిత సమాజ స్థాపన కోసం తన వంతు కృషి చేస్తానని రిషబ్‌ పేర్కొన్నారు.

బీసీలకు 50శాతం రిజర్వేషన్‌ అమలు చేయాలి



మల్లికార్జున ఖర్గేను కలిసిన గౌడ సంఘాల కల్లుగీత సమన్వయ కమిటీ ప్రతినిధులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: స్థానిక సంస్థల్లో బీసీ జనాభా ప్రకారం 50శాతం రిజర్వేషన్‌ అమలు చేసి ఆ ఫలాలు అందరికి అందేలా తగిన చర్యలు తీసుకోవాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ విజ్ఞప్తి చేసింది. సమన్వయ కమిటీ చైర్మన్‌ బాలగొని బాలరాజుగౌడ్‌, రాష్ట్ర కన్వీనర్‌ అయిలి వెంకన్నగౌడ్‌, బీసీ సంఘం నాయకులు వి.నాగభూషణం ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో మల్లికార్జున ఖర్గేను కలిసి వినతి పత్రం సమర్పించారు.

◆ అనంతరం వారు మాట్లాడుతూ... తెలంగాణలో సమగ్ర బీసీ కులాల సర్వేను నిర్వహిస్తున్నందుకు ప్రతిపక్ష నాయకులు రాహుల్‌ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. తెలంగాణలో మళ్లీ కల్లుగీత వృత్తిపై నిర్బంధం కొనసాగుతుందని వెంటనే గౌడ్‌లపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఆయనకు విన్నవించారు.

◆ భారత్‌ జోడో యాత్రలో రాహుల్‌గాంధీని కలిసినప్పుడు తెలంగాణలో కాంగ్రెస్‌ ప్రభుత్వం వస్తే గౌడ్స్‌, బీసీ జనాభా ప్రాతిపదికన అన్ని రంగాలలో సమాన వాటా దక్కాలని ఆనాడే రాహుల్‌గాంధీకి వివరించామని గుర్తుచేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. జనగామ జిల్లాకు సర్దార్‌ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని, ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని, కల్లుగీత వృత్తికి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు ఖర్గేకు వినతి పత్రం సమర్పించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

అంబర్‌పేట: సాయిదత్త ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుప్రతి ఎండీ డా. ధనుంజయ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మల్లికార్జున్‌నగర్‌లోని ఆసుపత్రి ప్రాంగణంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సన్మానం



డీఎంసీ మారుతీ దివాకర్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

అంబర్‌పేట: బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలకు సహకరించిన జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందికి శుక్రవారం నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం బొడ్రాయి వద్ద జీహెచ్‌ఎంసీ సర్కిల్‌-16 డిప్యూటీ మున్సిపల్‌ కమిషనర్‌ మారుతీ దివాకర్‌కు ఆలయ కమిటీ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దుర్గప్రసాద్‌రెడ్డి, గిరిధర్‌గౌడ్‌, రంగంపల్లి రాజు, చింతాల శ్రీనివాస్‌ముదిరాజ్‌, కిశోర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల రిమాండ్‌

నల్లకుంట: గంజాయితో సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన నల్లకుంట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఎస్సై కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్‌కుమార్‌ సింగ్‌(23), జోగేంద్ర కౌర్‌(33) ఇద్దరు మియాపూర్‌లో కూలీలుగా పనిచేస్తున్నారు. కాగా ఎక్కువ మొత్తంలో డబ్బులు సంపాదించాలనే ఆశతో ఆ ఇద్దరు గత కొంత కాలంగా గంజాయి తీసుకొచ్చి కూలీలకు విక్రయిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం కాచిగూడ రైల్వే స్టేషన్‌ నుంచి నడుచుకుంటూ నల్లకుంట ఫీవర్‌ ఆసుపత్రి వద్దకు వచ్చారు. ఆ సమయంలో అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు అనుమానాస్పదంగా ఉన్న ఆ ఇద్దరిని తనిఖీ చేశారు. దీంతో వారి వద్ద ఉన్న సంచిలో 5 కిలోల గంజాయి లభించింది. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకు వెళ్లి విచారించారు. పోలీసుల విచారణలో ఆకాష్‌ అనే వ్యక్తి గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల నుంచి గంజాయి కొనుగోలు చేసి తమకు ఇస్తున్నాడని పోలీసుల విచారణలో చెప్పారు. కాగా ఆకాష్‌ ఆచూకీ లభించలేదు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరిని శుక్రవారం నాంపల్లి క్రిమినల్‌ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆ ఇద్దరికి రిమాండ్‌ విధించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కాచిగూడ: రైల్లో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో శుక్రవారం జరిగింది. రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ ఎండీ మక్సూద్‌ తెలిపిన వివరాల ప్రకారం ... వాడి నుంచి కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చిన రైలును శుభ్రం చేస్తుండగా సిబ్బందికి వ్యక్తి మృతదేహం కనిపించింది. వెంటనే రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బంద్‌లో ఐఎన్‌టీయూసీ పాల్గొనదు



సమావేశంలో మాట్లాడుతున్న గోదా మల్లేష్‌గౌడ్‌, దయానంద్‌

కాచిగూడ: డిసెంబర్‌ 7న జరగబోయే ఆటో బంద్‌లో ఐఎన్‌టీయూసీ పాల్గొనదని రాష్ట్ర ఆటో డ్రైవర్స్‌ అండ్‌ వర్కర్స్‌ యూనియన్‌ (ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి గోదా మల్లేష్‌గౌడ్‌, గ్రేటర్‌ అధ్యక్షుడు దయానంద్‌ తెలిపారు. శుక్రవారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ఆటో డ్రైవర్ల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన వాటికి కట్టుబడి ఉందన్నారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌, కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీగౌడ్‌కు యూనియన్‌ తరఫున వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. త్వరలోనే అన్ని ఆటో యూనియన్‌ నాయకులతో రౌండ్‌ టేబుల్‌ సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించడానికి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

◆ ఈ నెల 7వ తేదీన రవీంద్రభారతిలో జరగబోయే ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్‌ రాష్ట్ర స్థాయి సదస్సులో మంత్రులతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌ కుమార్‌గౌడ్‌, రాష్ట్ర కాంగ్రెస్‌ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌ మున్షీ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సుకు ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ఈ సమావేశంలో యూనియన్‌ గౌరవ అధ్యక్షుడు ఉప్పల శ్రవణ్‌ కుమార్‌, మహేష్‌ దేశ్‌పాక తదితరులు పాల్గొన్నారు.

వార్డు ఆఫీసర్లను తిరిగి తీసుకునేందుకు చర్యలు తీసుకుంటాం

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌ లచ్చిరెడ్డి



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వార్డు ఆఫీసర్లను తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకునేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి తగిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు, తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌ లచ్చిరెడ్డి అన్నారు.శుక్రవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో గత ప్రభుత్వం హయాంలో వార్డు ఆఫీసర్లుగా నియమితులైన పూర్వ వీఆర్‌ఏ, జూనియర్‌ అసిస్టెంట్‌ల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం త్వరలో తీసుకురాబోయే గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థలో ఉద్యోగులుగా తీసుకునే విధంగా అనేక ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించే బాధ్యతను ఈ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను తిరిగి వ్యవస్థీకరించి పూర్వ రెవెన్యూ ఉద్యోగులను వెనక్కు తీసుకువచ్చే విధంగా కృషిచేస్తాం అన్నారు.

◆ ఉద్యోగ సంఘాలు వ్యవస్థలను కాపాడి ఉద్యోగుస్తుల భద్రతే ప్రాధాన్యతగా ఉద్యమాలు చేయాలన్నారు. వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న కొన్ని సంఘాలు ఇప్పటికైనా మారి ఉద్యోగులకు అండగా నిలవాలన్నారు. తెలంగాణ తహసీల్దార్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి గౌతంకుమార్‌ మాట్లాడుతూ... వీఆర్‌ఏలకు పేస్కేల్‌ రావడంతో ట్రేసా పాత్ర ఉందని వారి ఉద్యమాలకు తాము అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, వార్డు ఆఫీసర్‌ల సంఘం నాయకులు రమేష్‌ బహదూర్‌, నాయకులు మల్లారం అర్జున్‌, లక్ష్మణ్‌, లింగరాజు, ప్రియాంకారెడ్డి, కోటేశ్వర్‌రావు, లక్ష్మీనారాయణ, దుర్గం శ్రీనివాస్‌, జనార్దన్‌ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు నామినేటెడ్‌ పోస్టులు ఇవ్వండి



కాచిగూడ: కాంగ్రెస్‌ ప్రభుత్వం నామినేటెడ్‌ పోస్టుల భర్తీలో పద్మశాలీ సామాజికవర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి ఆరోపించారు. శుక్రవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో పద్మశాలీయుల సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. నామినేటెడ్‌ పోస్టులను దొడ్డిదారిలో అగ్ర కులాల వారికి కేటాయిస్తూ పద్మశాలీయులను విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. పద్మశాలీ కార్పొరేషన్‌ను అటకెక్కించారని, టెస్కో, పవర్‌లూమ్‌ కార్పొరేషన్‌ను తుంగలో తొక్కారని ఆరోపించారు. ఇప్పుడు యూనివర్సిటీలలో వీసీలుగా విద్యావంతులైన పద్మశాలీలకు అవకాశం కల్పించాలన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే బీసీలను అణగదొక్కడమేనా అని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పద్మశాలీలను గుర్తించి నామినేటెడ్‌ పోస్టుల్లో అవకాశం కల్పించాలని డిమాండ్‌ చేశారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



ప్రగతి పాఠశాలలో ట్రాఫిక్‌ అవగాహన కార్యక్రమంలో ఏసీపీ ఎన్‌ వెంకటేశ్వర్లు

అంబర్‌పేట: మైనర్లు వాహనాలు నడిపడం చట్టారీత్యా నేరమని దీనిని తల్లిదండ్రులు, విద్యా సంస్థల్లో ఉపాధ్యాయలు విద్యార్థులకు అవగాహన కల్పించాలని బేగంపేట ట్రాఫిక్‌ ట్రైనింగ్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఏసీపీ ఎన్‌.వెంకటేశ్వరరావు కోరారు. శుక్రవారం అంబర్‌పేటలోని ప్రగతి విద్యానికేతన్‌లో ట్రాఫిక్‌ నిబంధనల పట్ల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడిపితే వారితో పాటు ఇతరులకు కూడా ప్రమాదకరమని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ లెనిన్‌బాబు, ఎస్‌ఐ వీరమల్లయ్య, పాఠశాల ప్రిన్సిపాల్‌ సుధాకర్‌, ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

దంత సంరక్షణతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న గాంధీ వైద్యులు

ముషీరాబాద్‌: దంత సంరక్షణతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని గాంధీ ఆసుపత్రి రిటైర్డ్‌ డెంటల్‌ సర్జన్‌ డాక్టర్‌ ఓ.నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్‌లోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో డాక్టర్‌ రావూస్‌ ఓరల్‌ హెల్త్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ వర్ధంతిని పురస్కరించుకొని బాలికలకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దంతాలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవాలని సూచించారు. దంత సమస్యలను నిర్లక్ష్యం చేస్తే కేన్సర్‌ వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అశోక్‌, అక్షయ్‌, ఉస్మాన్‌, భోగరాజు, మహేష్‌, హాస్టల్‌ వార్డన్‌ భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ గృహ నిర్బంధం అప్రజాస్వామికం

ముషీరాబాద్‌: బీఆర్‌ఎస్‌ అగ్రనాయకులు హరీష్‌రావు, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులపై కేసులు బనాయించి అక్రమంగా అరెస్టులు చేస్తున్న కాంగ్రెస్‌ ప్రభుత్వ కక్షపూరిత ధోరణికి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్‌ పార్టీ నిరసన కార్యక్రమాలకు శుక్రవారం పిలుపునిచ్చింది. దీంతో పోలీసులు అప్రమత్తమైన నిరసన కార్యక్రమాలను భగ్నం చేసేందుకు బీఆర్‌ఎస్‌ నేతలను ఇంటి నుంచి బయటకు రాకుండా హౌస్‌ అరెస్టు చేశారు. ముషీరాబాద్‌ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను ఎమ్మెల్యే క్వాటర్స్‌లోని తన నివాసం నుంచి బయటకు వస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. బయటకు రాకుండా కదలనివ్వకుండా ఇంటికే పరిమితం చేశారు. అక్రమ గృహ నిర్బంధం అప్రజాస్వామికమని ఆయన అన్నారు. గాంధీనగర్‌లోని తన నివాసం నుంచి బయటకు రాకుండా బీఆర్‌ఎస్‌ యువ నేత ముఠా జైసింహను పోలీసులు అడ్డుకున్నారు.

గోల్నాక కార్పొరేటర్‌ హౌజ్‌ అరెస్ట్‌

నల్లకుంట: బీఆర్‌ఎస్‌ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ట్యాంక్‌బండ్‌ అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నిరసనకు పిలుపునిచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు ముందస్తు చర్యలో భాగంగా నల్లకుంటలోని గోల్నాక కార్పొరేటర్‌ దూసరి లావణ్య శ్రీనివాస్‌ గౌడ్‌ ఇంటికి చేరుకున్న నల్లకుంట పోలీసులు కార్పొరేటర్‌ దంపతులను హౌజ్‌ అరెస్ట్‌ చేశారు. కార్పొరేటర్‌ దంపతులు ఇంటి నుంచి బయటకు రాకుండా సాయంత్రం వరకు పోలీసులు అక్కడే మకాం వేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. తమ నాయకులపై ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు.




సైన్స్‌ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి



ఎగ్జిబిషన్‌ ఇన్‌స్పైర్డ్‌

ముషీరాబాద్‌: ముషీరాబాద్‌లోని సెయింట్‌ పాయిస్‌ హై స్కూల్‌లో ఏర్పాటు ఇన్‌స్పైర్‌ సైన్స్‌ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం హైదరాబాద్‌ జిల్లా కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో కొన్ని ఎగ్జిబిట్లు విశేషంగా ఆకర్షించాయి. అందులో కొన్ని ఇలా...

బట్టలు ఉతికినట్లే డిష్‌వాషింగ్‌..



మనం బట్టలు ఉతికేందుకు వాషింగ్‌ మిషిన్‌ను వాడినట్లే మనం వాడేసిన వస్తువులు, ప్లేట్లు, గ్లాసులు, గిన్నెలను కూడా వాషింగ్‌ మిషన్‌లో వేసి ఎలా శుభ్రపరుచుకోవచ్చో ఆగాపురా న్యూ ప్యారమౌంట్‌ హై స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఉత్సవి కోర్‌వార్‌ తన ప్రయోగం ద్వారా ప్రదర్శించి ఔరా అనిపించింది. మనం వాడేసిన గిన్నెలను వాషింగ్‌ మిషిన్‌లో వేసినట్లే వేసి వాటికి డిటర్జెట్‌ను నీటిలో కలిపి పంపుతుంది. బటన్‌ కొక్కగానే నీరు ప్రెషర్‌తో వాషింగ్‌ మిషిన్‌తో తిరుగుతూ గిన్నెలను శుభ్రపరుస్తాయి. ఇక్కడ విచిత్రమేమిటంటే వాషింగ్‌ మిషిన్‌లో బట్టలు అటూ ఇటూ తిరుగుతుండగా ఇక్కడ మాత్రం గిన్నెలు ఒకే చోట ఉండగా నీరు మాత్రం వాటి చుట్టు ప్రెజర్‌తో తిరిగి శుభ్రపరుస్తాయి.

వేస్ట్‌ మేనేజ్‌మెంట్‌తో విద్యుత్‌



ఒక కాలనీలో వేస్ట్‌ చెత్తను సేకరించిన అనంతరం వాటిని తడి, పొడి చెత్త, ప్లాస్టిక్‌లను వేరు వేరు చేసి ఆ చెత్తను ఒక యంత్రంలో వేసి హీట్‌ చేసినప్పుడు ఆ హీట్‌కు పక్కనే ఉన్న సోలార్‌ ప్యానల్‌ వేడిని తీసుకోని విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయి. తయారైన విద్యుత్‌తో విద్యుత్‌ దీపాలు, అవసరమైన విద్యుత్‌ను వాడుకోవచ్చు. కాల్చిన తరువాత మిగిలిన బూడిదను రోడ్డు కన్‌స్ట్రక్షన్స్‌కు వాడుకోవచ్చని నార్త్‌ లాలాగూడ లిల్లీ మోడల్‌ హై స్కూల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థిని జశ్విత ప్రయోగాన్ని తయారు చేసి ప్రదర్శించి మన్ననలు పొందారు.